# "గీర్వాణి"

కుమారి నిడదవోలు, మాలతి.

"నాకు నేత చీరెలు చూస్తే అసహ్యం. కట్టుకునే వాళ్ళు మరెలాగ కట్టుకుంటారోగాని." అంది గీర్వాణి ముహం వికారంగా పెట్టి.

ఈ మాటలు ఎవర్ని వుద్దేశింపబడ్డాయో అందరికీ తెలుసు. జానకి పుస్తకాలు పట్టుకుని అప్పుడే వస్తోంది. గీర్వాణి మాటలు వినీపిననట్టు ఓ నవ్వునవ్వేసి తలొంచుకొని ఓ మూల కుర్చీ దగ్గిరికి వెళ్ళిపోయింది.

ఆ నవ్వు సిగ్గుతో క్రుంగిపోతుందనుకున్న గీర్వాణిని వెక్కిరించింది.

"నామటుకు నాకు అవి కట్టుకుంటే జెర్రులు ప్రాకినట్టుంటుంది." అంది తనేమళ్ళీ.

"అసలు అది ముట్టుకుంటేనే నీ సుకుమార హస్తాలు కందిపోతాయేమో ?" అంది కామేశ్వరి, కామేశ్వరికి గీర్వాణంటే వళ్ళు మంట గీర్వాణికి జానికంటే కోపం.

కారణం ఒకమాటు తన మాట జానకి నిరసించడమే.

ఇంగ్లీషు లెక్చెరర్ లెసెన్సు బాగా చెప్పడం లేదు. ఫాలో కావడం చాలా కష్టంగా ఉంది, పరీక్షలపేరు ఎత్తితే భయం వేస్తోంది.

"పోనీ, ప్రిన్సిపాల్‌తో రిపోర్ట్ చేద్దాం. లెక్చెరర్‌ని మార్చమని." అంది గీర్వాణి అతి సుళువుగా తేల్చేస్తూ.

అదే కాలేజీలో చదువుతూ లెక్చరర్‌మీద రిపోర్ట్ చెయ్యడం మాటలా ?

"అమ్మ బాబోయ్ !" అన్నారు ఒకళ్ళు.

"గుండెలు తీసినపని" అన్నారింకొకళ్ళు.

"ఓహో ! జోహార్లర్పించదగ్గ భారతవీర నారీమణులు." అంది గీర్వాణి వేళాకోళంగా.

"అలా చెయ్యడం మర్యాదాకాదు, క్షేమమూకాదు." అంది జానకి మెల్లిగా.

దాంతో గీర్వాణి అహంభావం తలెత్తింది, "యోగక్షేమాలూ, పరువూ మర్యాదల సంగతి తరవాత. ముందు రాబోయే పరీక్షల విషయం ఆలోచించు." అంది వస్తున్న కోపాన్ని అణచిపెట్టి.

జానకి తొణక్కుండా జవాబిచ్చింది ; "అదే నా వుద్దేశమూనూ. ఎప్పటికైనా మనపై వాళ్ళు వాళ్ళు కాని, వాళ్ళపైవాళ్ళం మనం కాదు" అని. గీర్వాణి కోపం తారాపథాన్నంటింది.

జానకి కాదనడం వల్లనే రిపోర్టు చింపిపారెయ్యవలసి వచ్చింది. లేకపోతే మిగిలిన వాళ్ళని తనెలాగైనా వప్పించేది.

అప్పట్నుంచీ గీర్వాణి, జానకితో మాట్లాడడం మానేసింది. సాధ్యమైనంత వరకు జానకిని వెక్కిరించి, వెళాకోళంచేసి అవమానించి, ఏడిపించాలని ప్రయత్నించేది. అంతకన్న చేయగలిగేది ఏముంది కనక ? అందులోనూ వాళ్ళూ బ్రతికి చెడ్డవాళ్ళని వినికిడి.

"జానకి ఉందాండి ?" అన్నాను.

"ఉంది. లోపలకి రండి" అంది, జానకి చెల్లెలు కాబోలు. ఎక్కడో చూసిన మొహంలా ఉంది అనుకున్నా లోపలికి వెళ్తూ. నేను విన్నమాట నిజమేమోననిపించేట్టు ఇల్లు బ్రతికి చెడ్డ ఇల్లులాగే ఉంది. ఇంతలో జానకి వచ్చింది.

"ఏంచేస్తున్నావు?" అన్నాను సంభాషణ కలుపుతూ

"ఏంలేదు. ఏంవుంది చెయ్యడానికి ?" అంది నవ్వుతూ.

"మీ చెల్లెలా ?"

"ఊఁ. మా చెల్లెలే."

"ఎక్కడో చూసినట్టున్నాను. ఎక్కడో జ్ఞాపకం రావడంలేదు" అన్నా ఆమెవేపుచూస్తూ. ఆ అమ్మాయి నవ్వేసి ఊరుకుంది.

"Dance చేస్తున్నప్పుడో, పాటకచేరీ చేస్తున్నప్పుడో చూశావేమో !" అంది జానకి.

నాకు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది.

"మీ చెల్లెలని నాకిన్నాళ్ళూ తెలీనేతెలీదు. అయితే డాన్సు చేసే చంద్రకుమారి మీరేనన్నమాట !" అన్నాను జానకితో ఆశ్చర్యంగా.

"దాని సంపాదనమీదే ఆధారపడి ఉన్నామనేకదా గీర్వాణికి నేనంటే అంత చులకన. కాని దానికి కారణం ఎవరో ఆలోచించదు " అంది జానకి బాధగా.

"ఏమిటన్నావూ ?" అన్నాను తన మాట అర్థం చేసుకోలేక.

"ఆ గీర్వాణి గర్వం మాటే చెప్తున్నా. మానాన్నగారు మద్రాసులో ఉన్నప్పుడు ధనవంతులే, కొన్నాళ్ళకి అప్పు అంటూ ఋజువూ, పత్రమూ లేకుండా ఈ గీర్వాణి తండ్రి ఇంచుమించు నాన్నగారి ధనమంతా తీసుకున్నారు. నాన్నగారి దగ్గిర అయిపోగానే ఈ విశాల ప్రపంచంలోకి అదృశ్యమైపోయారు ఆ మహాత్ములు. మళ్ళీ ఇక్కడ అవతరించారు." అంది జానకి. కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. పాపం వాళ్ళ నాన్నగారు ఇప్పుడు మంచంమీద ఉన్నారట.

కాలచక్రంలో సంవత్సరాలు దొర్లాయి. హఠాత్తుగా ఓరోజు జానకీ, కామేశ్వరీ కనిపించారు, ముగ్గురం కలిసినందుకు చాలా సంతోషించాం. కబుర్లు చెప్పుకున్నాం. ఆఖరికి సినిమాకి వెళ్ళాం. న్యూస్‌రీల్ వేస్తూండగా ఒకమ్మాయి వచ్చి మా ముందు లైనులో కూర్చుంది. గుర్తుపట్టడానికి అట్టేసేపు పట్టలేదు.

"గీర్వాణి ! క్షేమమా ?" అని పలకరించాను.

"ఆఁ. నీదయవల్ల" అంది విసురుగా.

మేం మెల్లగా నవ్వుకున్నాం.

కామేశ్వరి "ముతక చీరెలు ఎలా కట్టుకుంటారో బాబూ !" అంది తను వినేటట్టుగా.

"ఎలా ఉంటుందో చూద్దామని సరదాకి కొన్నాను." అంది గీర్వాణి....సార్థక నామధేయురాలు. చింత చచ్చినా చావని పులుపు.

"ఎన్నాళ్ళనుంచి ?" అని ప్రశ్నించింది మళ్ళీ కామేశ్వరి.

గీర్వాణి మాట్లాడలేదు.

ఎవరో ఎవరితోనో అంటున్నారు. "పాపం ఆ అమ్మాయి ఆస్తి ఈ మధ్య దావాల్లో గట్టిదెబ్బతింది. దురదృష్టం తన్నుకొచ్చి దొంగలు పడ్డారు. తండ్రి మంచమెక్కాడు.........

★


" శ్రీవిస్ - ఆమ్ల " తలనూనె




S.VISWANADHAM & CO., MADRAS-1

యస్. విశ్వనాథం అండ్ కంపెని,

7. ఫ్రాన్సిస్ జోసఫ్ వీధి. మదరాసు. 1.